సాక్షి
కుమురం భీం
శుక్రవారం ౹ 15 ౹ సెప్టెంబర్ ౹ 2023



ఘనంగా పొలాల పండుగ

జిల్లా వ్యాప్తంగా పొలాల అమావాస్యను రైతులు, ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఎద్దులను అందంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

III లో ▸



పార్టీ గెలుపునకు కృషి చేయాలి

జైనూర్: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం జైనూర్‌లో కార్యకర్తలతో మాట్లాడారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4 /24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

మేమెట్ల బతకాలె..!

- సింగరేణి సంస్థ మమ్మల్ని పట్టించుకోవడం లేదు..
- ఇప్పటికీ పూర్తి పరిహారం ఇవ్వలేదు
- ఉద్యోగాల హామీ నెరవేర్చలేదు
- ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితుల ఆవేదన

తిర్యాణి(ఆసిఫాబాద్): బొగ్గుబాయి వస్తే మా బతుకుల్లో ఏమైనా మార్పు వస్తుందన్న ఆశతో మా భూములన్నీ మీకిచ్చినం.. సింగరేణి సంస్థ మమ్మల్ని పట్టించుకోవడంలేదు.. ఏ సార్లకు చెప్పుకున్నా సమస్యలు పరిష్కరించడం లేదంటూ డోర్లి–1 ఓపెన్‌కాస్ట్ భూ నిర్వాసితులు ప్రజాభిప్రాయ సేకరణలో తమ బాధలు వెలిబుచ్చారు. బెల్లంపెల్లి ఏరియా పరిధిలోని డోర్లి–1 ఓపెన్‌కాస్టు మూసివేత కోసం అవసరమగు పర్యావరణ అనుమతుల కోసం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ఓసీపీ కార్యాలయ ఆవరణలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ వేణు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ లక్ష్మణ్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్ మానస హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు భూనిర్వాసితులు మాట్లాడుతూ తాము కొత్తగా సింగరేణి సంస్థ నుంచి ఏమీ అడగడంలేదని, మేము ఏం ఓసీపీ ద్వారా ఏం కోల్పోయామో దానినే ఇవ్వమని అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. 2005లో ఓపెన్‌కాస్టు అనుమతి సమయంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సింగరేణి ఇచ్చిన హామీల్లో నేటికీ సగం కూడా నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కల్పించిన పునరావాస గ్రామాల్లో జీవించే పరిస్థితిలేదని దంతన్‌పెల్లి, ఒంటి మామిడి గ్రామాల పక్కనున్న డంపింగ్ ద్వారా వర్షపునీరు ఊట రూపంలో ఇళ్లలోకి చేరుతోందని, కనీసం వంట చేసుకునే పరిస్థితి కూడా లేదన్నారు. ఓసీపీ కారణంగా తాగునీరు కలుషితం కావడంతో రోగాల బారిన పడుతున్నామన్నారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మభ్యపెట్టిన అధికారులు మమ్మల్ని కాదని ఓబి, సెక్యూరిటీ విభాగంలో వేరే ప్రాంతాలకు చెందిన వారికి అవకాశం కల్పిస్తున్నారన్నారు. అటూ భూమిని కోల్పోయి ఇటు ఉపాధిలేక వలసవాసులుగా మారామని ఆవేదన చెందారు. మా భూముల్లో వెలికితీసిన బొగ్గుతో సంస్థ లాభాలు గడిస్తోందని, డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులను నిర్వాసిత ప్రాంతాల్లో కాకుండా వేరే ప్రాంతాల్లో



అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న భూనిర్వాసితులు

ఖర్చుచేస్తూ మా అభివృద్ధిని పట్టించుకోవడంలేదన్నారు. సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తే కేసులు పెడుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఉల్లిపిట్ట గ్రామానికి నేటికీ పునరావాసం కల్పించకపోవడంతో డంపింగ్ మట్టితో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పునరావాసం కల్పించాలని లేదనంటే కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రూ.4.5 కోట్ల నిధులు మంజూరు

అనంతరం ఏరియా జీఎం రవిచంద్ర మాట్లాడుతూ నిర్వాసిత గ్రామాల్లో సౌకర్యాల కల్పనకు రూ.4.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మూడేళ్లలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనికి అంగీకరించని నిర్వాసితులు మూడు నెలల్లోనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సమావేశం నుంచి బయటకు వెళ్లారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

జాయింట్ కలెక్టర్ వేణు మాట్లాడుతూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను సింగరేణి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నిర్వాసితులందరికీ హెల్త్‌కార్డులతో పాటు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, వైస్ ఎంపీపీ కోవ పార్వతి, కార్మిక సంఘాల నాయకులు పత్తెం రాజాబాబు, ఎస్.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులు ఇక్కడే ఖర్చుచేయాలి



నిర్వాసిత ప్రాంత ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత సింగరేణి సంస్థ పైనే ఉంటుంది. సీఎస్ఆర్ నిధులను వేరే ప్రాంతాలకు మళ్లించకుండా నిర్వాసిత ప్రాంతాల్లో మెరుగైన విద్య, వైద్యం రవాణ, రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుంది.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

అధికారుల మాటలు విని మోసపోయాం



భూములు తీసుకునే సమయంలో ఎన్నో మాటలు చెప్పారు. కానీ ఇప్పటి వరకు మా అభివృద్ధికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు. ఉన్న భూములు పోయి ఇటు సంస్థ ఉపాధి కల్పించకపోవడంతో కూలీలుగా మారిన పరిస్థితి నెలకొంది. మా భూముల్లో మేము వ్యవసాయం చేసుకున్నా బాగుండు, సింగరేణి అధికారుల మాటలు విని మోసపోయాం.

– ఆత్రం మారు, జెండాగూడ

పునరావాసం కల్పించాలి



మా గ్రామానికి నేటికీ పునరావాసం కల్పించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. 10 మంది నిర్వాసితుల్లో ఒక్కరికి మాత్రమే ఉపాధి కల్పించి చేతులు దులుపుకున్నారు. మేము భూమి ఇచ్చిన సమయంలో రూ.85 వేలు చెల్లించారు. కౌలుకు ఇచ్చుకున్నా మాకు పైసలు ఎక్కువ వచ్చేవి. భూమి లేకుండా మేం బతుకుడెట్ల. పునరావాసం కల్పించాలి. లేదంటే కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలి.

– హోక్డుబాయి, ఉల్లిపిట్ట

వైద్యవిద్యకు వేళాయె

- నేడు మెడికల్ కళాశాలను వర్చువల్ ద్వారా ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- నెరవేరనున్న జిల్లా వాసుల కల
- నేటి నుంచి తరగతులు ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా మెడికల్ కళాశాల

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల కల నేడు నెరవేరబోతోంది. వందమంది వైద్య విద్యార్థులతో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. సీఎం కేసీఆర్ ప్రగతి భవన్ నుంచి వర్చువల్ పద్ధతిన శుక్రవారం మెడికల్ కాలేజీని ప్రారంభించబోతున్నారు. ప్రతీ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ గతేడాది కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఎనిమిది ఎకరాల విశాలమైన స్థలంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలతో కళాశాల భవనం నిర్మించారు. కళాశాల ప్రారంభోత్సవానికి మంత్రి మల్లారెడ్డి, కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీచైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్లు కళాశాల ప్రిన్సిపా ల్ నాగార్జునచారి తెలిపారు.

ఎన్ఎంసీ అనుమతులు

జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తూ 2023 ఏప్రిల్ 21న అనుమతులు జారీ చేసింది. కాళోజీ నారాయణరావు హెల్త్ యునివర్సిటీ ఆధ్వర్యంలో కళాశాలకు వంద ఎంబీబీఎస్ సీట్లు కేటాయించారు. పూర్తిస్థాయిలో అడ్మిషన్లు పూర్తయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. నేటి నుంచి వైద్య విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన కూడా అందించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు.

ఎంబీబీఎస్ తరగతులకు శ్రీకారం

ఆసిఫాబాద్ మెడికల్ కళాశాలకు ఈ ఏడాది వంద సీట్లు కేటాయించగా ఇందులో 15 సీట్లను ఆల్ ఇండియా కోటాలో, మరో 85 సీట్లు మన రాష్ట్ర అభ్యర్థులకు అవకాశం ఉంటుంది. 40 శాతం బాలురు, 60 శాతం బాలికలకు సీట్లు కేటాయించారు. ఆగస్టు మొదటి వారంలో కౌన్సిలింగ్ ప్రారంభంకాగా జిల్లా ఆస్పత్రిలో బెడ్స్ సిద్ధం చేశారు. అన్ని హంగులతో నిర్మించిన భవనంలో ఇదివరకే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కాలేజీ ప్రారంభమైన వారంలోపు అందుబాటులో ఉండనున్నారు.

న్యూస్‌రీల్

17న అర్చకుల సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథస్వామి ఆలయంలో ఈ నెల 17న ఆదివారం సాయంత్రం 4 గంటలకు అర్చకులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఒజ్జల శిరీష్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రానున్న గణపతి నవరాత్రులు, నిమజ్జనోత్సవ కార్యక్రమ తేదీ, తదితర విదివిధానాలపై తీసుకోవాల్సిన నిర్ణయంపై చర్చించనున్నట్లు వారు పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని అర్చకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కోరుతూ గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి మాట్లాడుతూ అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోకుండా చూడాలన్నారు. ప్రిఫరెన్సియల్ కేటగిరీ ధ్రువపత్రాలను కలెక్టర్ ఆధ్వర్యంలో పరిశీలించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు, కోశాధికారి రమేశ్, నాయకులు ఊశన్న, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి అధికారికంగా నిర్వహించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 17న విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కరాచారి గురువారం బీసీ సంక్షేమాధికారి రమాదేవికి వినతిపత్రం అందజేశారు. గతేడాది కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తూమోజు సురేష్‌చారి, చిలుకూరి రాధాకృష్ణచారి, బట్టుపల్లి అశోక్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌లో ప్రతిభ

సిర్పూర్(టి): ఈ నెల 13న కాగజ్‌నగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. సెమినార్‌కు జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హాజరయ్యారు. పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి జే.రాజేశ్వర్ మిల్లెట్స్ గుడ్ ఆర్ బ్యాడ్ అనే అంశంపై సెమినార్ ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ బాలరాజు తెలిపారు.

జిల్లాలో 48.5 మిల్లీమీటర్ల వర్షపాతం

ఆసిఫాబాద్: జిల్లాలో గురువారం 48.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం, అత్యధికంగా దహెగాంలో 132.4 మిల్లీ మీటర్లు నమోదైంది. జైనూర్‌లో 17.6, సిర్పూర్(యూ) 12.4, లింగాపూర్‌లో 12.2, తిర్యాణిలో 23.4, రెబ్బెనలో 40.0, ఆసిఫాబాద్‌లో 25.2, కెరమెరిలో 38.2, వాంకిడిలో 60.4, కాగజ్‌నగర్‌లో 56.4, సిర్పూర్(టి)లో 71.8, కౌటాలలో 39.8, చింతలమానెపల్లిలో 38.2, బెజ్జూర్‌లో 46.6, పెంచికల్‌పేట్‌లో 112.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కొమురంభీం ప్రాజెక్టు గేటు ఎత్తివేత

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. కొమురంభీమ్ ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 243 మీటర్లు కాగా 237,450 మీటర్లకు చేరడంతో గురువారం ప్రాజెక్టు 5వగేట్ ఎత్తివేసినట్లు అధికారులు తెలిపారు. వట్టివాగు ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 239.500 మీటర్లు కాగా 238.850 మీటర్లకు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 326.300 మీటర్లు కాగా 32.100 మీటర్లకు చేరాయి.

వేంపల్లి జీపీకి ఉత్తమ అవార్డు

సిర్పూర్(టి): పచ్చదనం, పరిశుభ్రతలో అభివృద్ధి కనబర్చినందులకు సిర్పూర్(టి) మండలం వేంపల్లి గ్రామ పంచాయతీ ఉత్తమ అవార్డు అందుకున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని టీఎస్ ఐపీడీలో పంచాయతీ రాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావ్, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా చేతుల మీదుగా సర్పంచ్ డోలె లక్ష్మి అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ లక్ష్మి

నేడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 21 సెంటర్లు 6,941 మంది అభ్యర్థులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయ అర్హత పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్‌లో 10, ఆసిఫాబాద్‌లో 11 పరీక్ష కేంద్రాలలో 6,941 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పేపర్–1కు 4,851 మంది, పేపర్–2కు 2,090 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఇటీవలే డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు టెట్ డీఎస్సీ పరీక్షకు సన్నద్ధం అవుతున్నారు. డీఈడీ అభ్యర్థులకు ఎస్‌జీటీ పోస్టులు ఇవ్వడంతో ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నారు.

జిల్లాలో 21 సెంటర్లు

ఉపాధ్యాయ అర్హత పరీక్షకు ఆసిఫాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్, గిరిజన మహిళా డిగ్రీ కళాశాల, రాజేంద్ర ప్రసాద్ బీఈడీ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, జన్కాపూర్ సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, పీటీజీ బాలుర ఉన్నత పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కాగజ్ నగర్‌లో వసుంధర డిగ్రీ కళాశాల, వివేకనంద జూనియర్ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల, ఎస్‌టీ క్లారట్ ఉన్నత పాఠశాలలో 2(ఏ,బీ), ఫాతిమా కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో 2 సెంటర్లు, (ఏ,బీ), ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎక్సెల్ ఉన్నత పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు 21 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 21 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, ముగ్గురు స్పెషల్ ఆఫీసర్లు, 210 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అభ్యర్థులు వీలైనంత తొందరగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు.



మోడల్‌స్కూల్‌లో నంబర్లు వేస్తున్న అధికారులు

పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: టెట్ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశిక్షణ పరిశోధన సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ రవికాంత్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాల పరీక్ష సెంటర్‌ను డీఈవో అశోక్‌తో కలిసి సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు 30 నిమిషాలు ముందే రావాలన్నారు. స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్లు అనుమతి లేదన్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వాగులో ఒకరి గల్లంతు


భీంరావు (ఫైల్)

బెజ్జూర్: చేపల వేటకు వెళ్లి వాగులో ఒకరు గల్లంతైన ఘటన మండలంలోని బారెగూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు గ్రామ సమీపంలోని పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాం వద్దకు చేపల వేట కోసం వెళ్లాడు. అక్కడ గల్లంతైనట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా సంఘటన స్థలానికి ఎస్సై విక్రం చేరుకొని వివరాలు సేకరించారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 56శాతం రిజర్వేషన్ కల్పించాలి

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో బీసీలకు 56శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు వంగల దయానంద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల జనాభా 56శాతం ఉంటే బీసీ ఉద్యోగులు కేవలం 9శాతం మాత్రమే ఉన్నారన్నారు. బీపీ మండల్ కమిషన్ బీసీలకు 27శాతం రిజర్వేషన్‌తో ఉద్యోగాలు కల్పించాలని నివేదిక ఇచ్చి 40ఏళ్లు గడిచినా ఏ ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. పాలక ప్రభుత్వం బీసీలకు 56శాతం ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

సకాలంలో పంట రుణాలు మంజూరు చేయాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: నూతనంగా పోడుపట్టాలు పొందిన రైతులకు పంట రుణాలు సకాలంలో మంజూరు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆర్థిక సహాయ పథకం, పంట రుణాలు మంజూరుపై గిరిజన సంక్షేమ, ఉమ్మడి జిల్లా బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్హులైన గిరిజన లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకాలకు యూనిట్లను మంజూరు చేయడం జరిగిందని, నిర్ధేశించిన లక్ష్యం మేరకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలు, బ్యాంకుల వారీగా లక్ష్యాలను చర్చించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, ఏఓ రాంబాబు, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

'టీబీజీకేఎస్‌వి అసత్య ప్రచారాలు'


మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణిలో వేజ్‌బోర్డ్ బకాయిల చెల్లింపు ప్రకటన టీబీజీకేఎస్ నాయకులు ఫలితంగా యాజమాన్యం వెల్లడించిందని అసత్య ప్రచారం చేస్తోందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఏరియాలోని కేకే-5 గని ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోలిండియాలో ఈ నెల 3న వేజ్‌బోర్డ్ బకాయిలు ఒకే దఫా చెల్లించాలని, సింగరేణిలో రెండు దఫాలు చెల్లిస్తామని యాజమాన్యం పేర్కొందని తెలిపారు. ఒకే దఫాలో చెల్లించాలని జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టగా యాజమాన్యం దిగి వచ్చి ఈ నెల 21న ఒకే దఫా చెల్లిస్తామని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. మోసపూరిత మాటలతో కార్మికులను టీబీజీకేఎస్ నమ్మించలేదన్నారు. ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నాయకులు అక్బర్ అలీ, శ్రీనివాస్, బానయ్య, సమ్మయ్య, తిరుపతి, వెంకటస్వామి ఉన్నారు.

గర్భిణికి ఫిట్స్

- అంబులెన్స్ వచ్చేందుకు మార్గం లేక ఆటోలో తీసుకెళ్లిన వైనం


గర్భిణిని ఆటోలో తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

బెజ్జూర్(సిర్పూర్): మండలంలోని ఇప్పలగూడకు చెందిన ఆత్రం రోజా అనే ఏడు నెలల గర్భిణికి గురువారం ఫిట్స్ వచ్చాయి. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆటోలో మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. సుస్మీర్ నుంచి వాయా సోమిని, కష్టపెల్లి మీదుగా వస్తే 12 కిలో మీటర్లు ఉండేదని, సరైన రోడ్డు లేక, హైలెవెల్ వంతెన నిర్మాణం కాలేక తలాయి గ్రామం మీదుగా తీసుకురావడంతో దాదాపు 20 కిలో మీటర్ల మేర రావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు కాగజ్‌నగర్‌కు రెఫర్ చేయగా అక్కడ కూడా వైద్యులు పట్టకపోవడంతో మంచిర్యాలకు తరలించినట్లు మహిళ భర్త ఆత్రం సుభాష్ తెలిపారు.

రేపు జిల్లా, జోనల్ స్థాయి రెజ్లింగ్ సెలక్షన్స్

నిర్మల్‌రూరల్: ఎస్‌జీఎఫ్ జిల్లా, జోనల్ స్థాయి (ఉమ్మడి ఆదిలాబాద్) అండర్ 14, 17 సెలక్షన్లు శనివారం భైంసా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. భైంసాలోని వేదం తపోవన్ స్కూల్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వివరాలకు నిర్వహణ కార్యదర్శి నఫీఖాన్‌ను 9440957385లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా పొలాల పండుగ

- ఎడ్లకు అలంకరణలు, ప్రత్యేక పూజలు
- జిల్లా కేంద్రంలో ఎద్దులతో ర్యాలీ


ర్యాలీ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు


ప్రధాన రహదారిపై ఎడ్లతో రైతుల ర్యాలీ


ఎడ్లకు పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

ఆసిఫాబాద్: పొలాల అమావాస్య వేడుకలను గురువారం జిల్లాలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. రైతులు తమ ఎడ్లను రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. ఉదయం ఇళ్లలో మట్టితో చేసిన ఎడ్లకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలు ఎడ్లకు సమర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఎడ్లకు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్, బెస్తవాడ, బనార్‌వాడ, తేలివాడతో పాటు పలు కాలనీలకు చెందిన రైతులు మేళతాళాలు, డప్పు చప్పుళ్లు, భజనలతో నృత్యం చేస్తూ ఎడ్లతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని అంకమరాజు సమాధి మందిరం, పోచమ్మ ఆలయాల చుట్టూ ఎడ్లతో ప్రదక్షణలు చేశారు. దస్నాపూర్ రాష్ట్రీయ రహదారిపై జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఎడ్ల ఊరేగింపు ప్రారంభించారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు మర్సుకోల సరస్వతి, రాథోడ్ గణేశ్, శ్యాంనాయక్, బీజేపీ నాయకులు ఖాండ్రే విశాల్, బీఆర్ఎస్ నాయకులు బాలేశ్వర్ గౌడ్, బీసీ సంఘం నాయకులు మారుతి పటేల్‌తో పాటు పలువురు రాజకీయ పార్టీ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఊరేగింపు తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఆసక్తి కనబరిచారు. సీఐ సురేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

నందులపల్లి మల్లన్న గుడి పూజారి మృతి

- ఆలయం వద్ద ఖననం చేయడాన్ని అడ్డుకున్న బంధువులు
- శవంతో 24 గంటల నిరీక్షణ
- పోలీసుల జోక్యంతో అంతిమ సంస్కారాలు పూర్తి


శవంతో నిరీక్షిస్తున్న చిన్న పోశం కుటుంబ సభ్యులు

నెన్నెల: భూ సమస్యతో నందులపల్లి మల్లన్న గుడి పూజారి పాలగాని చిన్నపోశం అంతిమ సంస్కారాలు వివాదాస్పదంగా మారాయి. గుడి పక్కన సమాధి చేయడాన్ని బంధువులు అడ్డుకోవడంతో 24గంటలు శవంతో నిరీక్షించాల్సి వచ్చింది. పోలీసులు జోక్యంతో గొడవ సద్దుమణిగింది. స్థానికుల వివరాల ప్రకారం... నందులపల్లిలోని రావులమల్లన్న గుడికి పాలి అన్నదమ్ములైన పెద్ద పోశం, చిన్న పోశంలు పూజారులుగా కొనసాగుతున్నారు. గుడితో పాటు చుట్టుపక్కల వ్యవసాయ భూమిపై ఆ రెండు కుటుంబాల మధ్య కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది. ఐదేళ్ల కిందట పెద్ద పోశం చనిపోగా గుడి పక్కన ఖననం చేసి స్మారక స్థూపంగా చిన్న గుడిని నిర్మించారు. చిన్న పోశం బుధవారం మృతి చెందగా గుడివద్దనే ఖననం చేయాలని వారి కుటుంబీకులు ఏర్పాటు చేస్తుండగా పెద్ద పోశం కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. భూమి పట్టా తమ పేరిట ఉందని సమాధి చేయబోనివ్వమని భీష్మించుకూర్చున్నారు. ఇరువర్గాలు వాదనకు దిగాయి. గొడవ భౌతికదాడులకు దిగే స్థాయికి చేరింది. విషయం పోలీసులకు తెలిసింది. బెల్లంపల్లి ఏసీపీ సదయ్య గురువారం నెన్నెలకు చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసి అంతిమ సంస్కారాలు జరిపించారు. గుడి వద్ద తండ్రి భీరయ్య సమాధి పక్కనే చిన్న పోశం మృతదేహాన్ని సమాధి చేశారు. బెల్లంపల్లి, తాండూర్, మందమర్రి సీఐలు శంకరయ్య, శ్రీనివాస్‌రావు, మహేందర్‌రెడ్డిలతో పాటు ఎస్సైలు శ్యాంపటేల్, ప్రవీణ్, రాజశేఖర్, అశోక్, చందన్‌కుమార్ ఉన్నారు.

కార్తీక్‌కు ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న ఎస్సై విజయ్

సాక్షి ఎఫెక్ట్..

కెరమెరి: మండలంలోని కేలికె గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్‌కు కెరమెరి ఎస్సై గుంపుల విజయ్ గురువారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ నెల 12న 'సాక్షి'లో 'పర్వతారోహణకు తొలి అడుగు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎస్సై స్పందించారు. సిక్కిం రాష్ట్రంలో ఈ నెల 18 నుంచి నెల రోజుల పాటు నిర్వహించే పర్వతారోహణ శిక్షణకు అవసరమున్న ఆర్థిక సహాయం అందించారు.

మంత్రి జగదీశ్‌రెడ్డిపై విచారణ జరపాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్ యాదవ్

నస్పూర్: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులపై సీబీఐ విచారణ జరిపించాలని భారత యాదవ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేశ్‌యాదవ్ తెలిపారు. గురువారం ఆయన నాయకులతో కలిసి నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌పై అకారణంగా నకిలీ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సూర్యాపేట నుంచి బీసీ కోటాలో టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని కోరినందుకే కక్షగట్టారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గొర్ర తిరుపతియాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అరిగెల పద్మయాదవ్, జిల్లా నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మేకల రమేశ్‌యాదవ్, మహేందర్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారలోపం అధిగమించడం అభినందనీయం

- కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి మాణిక్‌రాజ్


వివరాలు తెలుసుకుంటున్న మాణిక్‌రాజ్, కలెక్టర్

ఆసిఫాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు చర్యలు చేపట్టడం అభినందనీయమని కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి మాణిక్‌రాజ్ అన్నారు. గురువారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి రెబ్బెన మండలం ఖైర్‌గాంలోని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రం, ఆసిఫాబాద్ మండలం సాలెగూడలోని మిల్లెట్ యూనిట్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ పోషకాహార లోపాన్ని అధిగమించడంలో విశేష కృషి చేసి, పోషకాహార రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంతం చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. ఆయన వెంట జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, డీపీఎం రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

నీతి ఆయోగ్ ప్రతీ అంశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: నీతి ఆయోగ్ ప్రతి అంశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర వ్యవహారాల సంయుక్త కార్యదర్శి మాణిక్‌రాజ్ అన్నారు. నీతి అయోగ్‌లో భాగంగా ఎంపికైన తిర్యాణి మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు.

గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు


మట్టి గణపతులు అందిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లాలో గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాంతి కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ గణేశ్ మండళ్ల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. మంటపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది మంటపాలను సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. మంటపాల వద్ద కమిటీ సభ్యుల వివరాలు ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ నిబంధన ల మేరకు రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్లు విని యోగించరాదన్నారు. కార్యక్రమంలో శాంతి కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి గెస్ట్ హౌజ్ వద్ద గురువారం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్ర మండలి ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగులకు, పరిసర ప్రాంతాల ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పాటు రకరకాల రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలను వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేయటంతో నీటిలోని జీవజాతులకు ప్రమాదం వాటిల్లుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ లక్ష్మణ్ ప్రసాద్, ఎస్‌వోటూ జీఎం మచ్చగిరి నరేందర్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మానస, తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్

చెన్నూర్: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్ అన్నారు. స్థానిక హబీబ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇచ్చిందన్నారు. ప్రజల ఆకాంక్ష నేరవేరాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. అనంతరం ఈ నెల 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. దానికి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. బహిరంగ సభకు పెద్దఎత్తున కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చెన్నూర్, కోటపల్లి మండలాల నాయకులు చెన్నూరి రాజేశ్, ఆలూరి సంపత్, దుర్గం వెంకటస్వామి ఉన్నారు.